

# కామాక్షి

కామాక్షి కన్పించడం లేదట. ఊరంతా గుసగుసలుగా ఉంది. నేను నమ్మలేదు. వీళ్ళందరికి భ్రాంతికాబోలనుకున్నాను. కాని ఓ గంట తరవాత నేనే భ్రాంతిపడ్డానని తెలుసుకున్నాను. నిజానికి ఆ అమ్మాయి సంగతి తెలిసిన వాళ్ళెవరైనా నాలా భ్రాంతి పడవలసిందే. ఏది ఏమైనా కామాక్షి కన్పించడం లేదన్న వదంతి ఊరంతా పాకింది. కదలిపోయిందిట. ఎక్కడికి? కడలిలోకా? కారడవిలోకా? లేక కైలాసానికా? కారణమేమిటో కూడా తెలియదయ్యె! ఆ అమ్మాయి ఏ దుష్కృత్యము చేయలేదని, చేయలేనిదని నా మనస్సు గట్టిగా వాదిస్తోంది. అయినా 'అందరిదో దారి ఆ నాథయ్యదో దారి' అన్నట్టు నేను వాదించినా వీళ్ళు వినేటట్టు లేరు. అందుకని నోరు కట్టేసుకుని కూర్చున్నాను కానీ, చెవులుమాత్రం మూసుకోలేకపోయాను. అవి టేప్ రికార్డు చేసినవి అన్నీ ఇన్నీ కావు. ఇవన్నీనూ.

కామాక్షి లేచిపోయిందట! ఎవరితోనో తెలియదట! ఊళ్ళో మగపురుగులన్నీ ఉన్నాయిట! అప్పటికప్పుడు ఆడవాళ్ళంతా తమ తమ మగవాళ్ళను లెక్కపెట్టుకున్నారన్నమాట. మరి కామాక్షి ఎవరితో లేచిపోయిందీ అన్నది పెద్ద ప్రశ్న అయింది. దానికి జవాబులు బోలెడు. వయస్సులో ఉంది. పెళ్లి కాలేదు. ఎర్రగా బుర్రగా ఉంది. కొవ్వుపట్టి ఒళ్ళుచేసింది. కళ్ళు నెత్తిమీదికి ఎచ్చాయి. కండకావరము! కాల మహిమ!...ఇలాంటి వింకా ఎన్నో. ఆపైన వ్యాఖ్యలు... ఎవరో దారినిపొయ్యే దానయ్య దొరక్కపోతాడా? దానికి బలే ధైర్యం ఉందిలే! మొన్న మా పెద్దవాణ్ణి "బావా!" అంటూ నవ్విందట. అయినా అచ్చమయిన ఆడదానికి పరాయి మగవాడితో సరసాలూ, నవ్వులూ ఎందుకంట! ఆఁ . . . మనం గుడ్డిగా ఉన్నాం గాని ఇన్నాళ్ళు అది ఏమేమి జేసిందో ఎవరి కెరుక? పట్నం వెళ్లిందేమో! అక్కడయితే హాయిగా పదిమందిలో పకాపకా నవ్వచ్చు! తుళ్లవచ్చు! ఇలా ఎవరికి తోచినవి వారంటున్నారు!

ఆంగ్లేయబోధిని

పిన్నలకు, పెద్దలకు ఉపయోగకరము. అక్షరాభ్యాసము రానివారు కూడా మా ఆంగ్లేయబోధిని సహాయంతో 60 దినములలో ఆంగ్లము నేర్చుకొనవచ్చును. బాలబాలికలకు చాలా సహాయపడును. మా ఆంగ్లేయబోధినిలో ఇంగ్లీషుకు ఉచ్చారణ పలుకురీతి తెలుగులో వ్రాయబడియున్నది. దీనిలో ఇంగ్లీషుకు తెలుగులో గ్రామరు, వ్యాసములు, ఉత్తరములు వ్రాయుట, సామెతలు, కథలు మున్నగు విషయములు చక్కగా సులభశైలిలో యున్నవి. సుమారు 600 పేజీలుగలపుస్తకం వెల: రు. 6-00. పోస్టేజి అదనం.

బాలసరస్వతీ బుక్ డిపో,
మద్రాసు – 1.

1969 లో మీ అదృష్టము

ఏదైన ఒక పుష్పం పేరును, మీ చిరునామాయును వ్రాసిన ఒక పోస్టుకార్డు మాత్రం పంపండి. మీకు వచ్చే 12 నెలల్లో వ్యాపారంలో లాభ నష్టములు, ఉద్యోగంలో ప్రమోషను, బదిలీ, సంతానం, వివాహ సౌఖ్యం మొదలైన వివరములు, దుష్టగ్రహ వీక్షణలకు శాంతివిధానములతో పాటు రు. 1—25 పై. లకు పంపగలము. పోస్టేజి అదనం. ఒకసారి చూచిన మీకే తెలియగలదు.



PT. DEV DUTT SHASTRI
Raj Jyotshi (A.P.)
P.B. No. 86, JULLUNDUR CITY




అన్నీ విన్నాను. కాని ఏం చెయగలను? ఫలానా చోట కామాక్షి ఉందని తెలిస్తే తీసుకువచ్చి వీళ్లందరి నోళ్లు మూయించి తిట్టేద్దును! కొట్టేద్దును! కాని ఏదీ, కామాక్షి ఎక్కడుంది?

ఏమిటో మనస్సంతా వికలమయిపోయింది. పాపం. కామిని వాళ్లంతా ఏదో అంటున్నారన్న బాధ నన్ను పీడిస్తూంది. మా శ్రీమతి మందలింపులతో భోంచేసి పడుకున్నాను. మా ఆవిడమాత్రం నిక్షేపంలా ఉంది.

అర్ధరాత్రి . . . "వదినా! వదినా!" అంటూ ఎవరో తలుపు తట్టుతున్నారు. కామి కంఠంలాగుంది. తలుపు తీశాను. నిండా ముసుగుతో కామే! ఆశ్చర్యపోయాను! అలాగే కొయ్యబారి నిలబడ్డాను. కాని ఎవరన్నా చూస్తే ప్రమాదమన్న మాట గుర్తుకువచ్చి కామిని లోపలికి రమ్మని, ఆ తరవాత గడియవేసి గబగబా వెళ్లి మా ఆవిణ్ని లేపాను. విభ్రమత్తులో కామిని చూసి ఆశ్చర్యంతో అదిరిపడింది.

నింపాదిగా "ఏమిటి, కామాక్షీ! ఎక్కడికి వెళ్లావు? ఊరంతా నీగురించి కోడై కూస్తూంది. ఏమిటి సంగతి?" అంటూ అడిగాను. కామి నిజంగా వింత విషయమే చెప్పింది. ఆ చెప్పింది మీకు చెప్పడానికి ముందు అసలు కామికీ నాకూ, ఆ తరవాత మా శ్రీమతికీ గల సంబంధమేమిటో చూద్దాం.

మూడేళ్లు బి. ఎ., ఆ తరవాత ఒక ఏడు బి. ఇడి., చదివి చివర కో బడిపంతులుగా రెండేళ్లక్రితం ఈ ఊళ్లో చేరాను. అప్పటికి నా కింకా పెళ్లి అవలేదు. బ్రహ్మచారినే గాని, రుచులెక్కువ. అందుకని వంట మొదలు పెట్టాను. ఇల్లు చవకగానే అద్దెకు దొరికింది. ఇంటివాళ్లు కరణాలు. ఇంటి అతను సరదా మనిషి. ఆవిడ—అతని భార్యమాత్రం ఛాయాదేవిగారే. అంటే సూర్యకాంతమ్మగారి బంధువర్గమన్నమాట. అయినా మనకెందుకులే అనుకుంటూ ఇంట్లో చేరి మరునాడు వంట కుపక్రమించిన వాణ్ణయి "ఏమండీ, అంట్లు తోమడానికి పనిమనిషి ఎవరైనా ఉన్నారాండీ" అంటూ అయ్యగారిని అడిగాను.

"ఆఁ . . . మరండీ మా ఇంట్లో ఓ అమ్మాయి పని చేస్తూందండీ. ఈ రోజు అప్పుడే వెళ్లిపోయింది. సాయంత్రం వస్తే మా ఆవిణ్ని అడగమంటానులెండి" అన్నాడు. సరే, ఆ సాయంత్రం నాకే సంగతీ చెప్పలేక పోయారు. అందుకని మరునాడు పొద్దున్నే ఆయన్ని పిలిచి మళ్లీ అడిగాను. ఆయన ఆ అమ్మాయిని పిలిచి అడిగాడు. ఇంతలోకే ఛాయమ్మగారు గోడచాటు నుండి "ఆఁ దాని బొంద. అదేమి తోముతుందండీ, మన ఇంటిపనికే చస్తూంటేను?" అంది.

"అదేంటమ్మగోరూ, అలాగంటారు! నే తోమ గలను!" అంటూ ఆ అమ్మాయి ఇవతలకి వచ్చింది. "ఏమియ్యమంటావ్ చెప్పు" అన్నాను. "అంట్లు తోముతాను. చిల్లర గుడ్డ లుతుకుతాను. కసవూడ్పుతాను. అయిదురూపాయ లివ్వండి" అంది. హైదరాబాదులో ఆ పనికే పదిరూపాయ లిచ్చేవాణ్ణి. అందుకని "సరే" నన్నాను సంతోషంగా.

అలా ఆ రోజు మొదటిసారిగా కామాక్షి పరిచయం అయింది. ఆ తరవాత ఆ అమ్మాయిని గురించి తెలిసిన సంగతు లివి:

కామికి తల్లి, తండ్రి లేరు. ఇద్దరు అన్నలున్నారు.

*ప్రేమించడం మహా తేలిక. ఆపైన లేచిపోవడం మహా కష్టం. ప్రేమించి లేచిపోయిన వాళ్ళు గుట్టుగా గుళ్ళో పెళ్ళాడడం గొప్ప వరం. ఆ వరం పొందిన వాళ్లని లోకు లేం చెయ్యలేరు, తెరచిన నోళ్లు మూసుకోవడం వినా.*

ఒకడికి పెళ్లి అయింది. మరొకడు వదిన గారి బాధలు సహించలేక వాళ్ల పిన్నమ్మ ఊరు వెళ్లి అక్కడే ఉంటు న్నాడు. కామాక్షి మాత్రం ఆడపిల్ల అవటంచేత, అందునా చిన్నది అవటంచేత వాళ్ళు ఏమన్నా తల వంచింది. పరికిణీ, జాకెట్టు గుడ్డలకు వదినగారి సణుగుడు వినలేక కామాక్షి సంపాదించ బూనుకుంది. అభిమానవతి కామి. కామి అభిమానానికి నాకు సంతోషమే అయింది.

ఓ రోజు అప్పుడే మెలకువ వచ్చింది. కామి అంట్లు తోముతూంది. ఇంతలో ధాయమ్మగారి గొంతు, "ఏమే, కామీ! ఒంటరిగా మొగాళ్ళు ఉన్న ఇంట్లో పనెలా చెయ్య బుద్ధి అవుతుందే?" అని విచారించింది. కామి ఏమి చెబుతుందోనని శ్రద్ధగా విన్నాను. "అదే టమ్మగారూ, మీ రూరెళ్లినప్పుడు అయ్యగా రొంటరి కారా? నే నంట్లు తోమలేదా?" అంది కామి. ధాయమ్మ గారు గప్‌చిప్‌గా నోరు మూసుకుంది. నాకు పరమ సంతోషమయింది.

కామి స్వతహాగా చాలా మంచిది. మంచి నడవడీ, విశ్వాసం కలది. అందుకని వంటగది తాళపుచెవి ఒకటి ఇచ్చాను. అప్పటినుండి నేను ఎప్పుడు వచ్చినా, ఎప్పుడు లేచినా ఏ బాధా ఉండేది కాదు. అప్పుడప్పుడు కామి వంటకూడా తనే చేసేది. కామి వంట బాగానే ఉంది. అందుకని మరో అయిదు రూపాయ లిస్తాను, వంటకూడా చేసిపెట్టమన్నాను. అలాగే నంది. ఆ రోజునుంచి కామి మా ఇంటికి అధికారిణి అయిందనే చెప్పాలి. అన్ని సరుకులూ తనే తెచ్చేది. అంతపనీ తనే చేసేది. నా పని తినడం మాత్రమే.

అలా కామాక్షికి నాతో బాగా చనువు ఏర్పడింది. ఆ మూడు నెలల్లోనే ఏవేవో కబుర్లు చెప్పేది. సరదాగా ఉండేది. మా ఇరువురిలో ఎవరికీ ఏ దురూహ రాలేదు. కాని ధాయమ్మగారు మాత్రం కామాక్షిని మా ఇంట్లో వంట చెయ్యవద్దందిట. దానికి కామాక్షి మాత్రం "మా అన్నలాటోడు ఆయన. మా అన్నలయితే వండిపెట్టనా" అందిట. కామాక్షే చెప్పింది ఈ విషయం. అది విన్నాక కామాక్షికి మనసులోనే కృతజ్ఞత అర్పించుకున్నాను.

ఆ తరవాత నాకు పెళ్లి అయింది. నెల రోజులకు మా శ్రీమతితో సహా ఆ ఊరు చేరాను. అప్పటినుండి కామాక్షి వంట మానేసింది. కాని అంట్లు తోమడం, సరుకులు తేవడం, ఆవిడకి సహాయపడడం, నేను స్కూలుకి వెళ్లినప్పుడు ఆవిడకి తోడుగా ఉండడం మున్నగు పనులు చేసేది. వాళ్లిద్దరూ చాలా అన్యోన్యంగా ఉండేవాళ్ళు. వదినా మరదళ్లలాగా చిలిపిగా మాట్లా డుతూ గిల్లికజ్జాలు పెట్టుకుని నేను స్కూలునించి రాగానే ఇద్దరూ ఫిర్యాదు చేసేవారు. ఎలాగో తగువు తీర్చేవాణ్ణి.

అన్నయ్యా, వదినా అంటూ కామి నోటినిండా పిలిచేది. మా ఇద్దరితో బాగా కలిసిపోయి, మా ఇంట్లో ఒకర్తెగా కామి ఉండిపోయింది. ఒక్క నిమిషం కామి లేకుంటే మా కాళ్ళ చేతులు ఆడేవి కావు. కామికి మాయందు గల చనువుకు అటు వాళ్ల వదినా, ఇటు మా ధాయమ్మగారు అసూయపడేవారంటే అతిశయోక్తి కాదు.

అలాంటి కామి ఉన్నట్టుండి పదిహేను రోజుల క్రితం మా ఇంట్లో పని మానేసింది. కారణం అడిగితే మా ఆవిడవేపు చూసిందే కాని ఏమీ చెప్పలేదు. మా అన్న వద్దన్నాడని చివరికి చెప్పింది. కాని నేను నమ్మ లేదు. ఆ కారణానికి మా ఆవిడ ఎంతో బాధపడ్డట్టు కప్పించేది. ఆవిడ బాధను కనిపెట్టి ఓ రోజు నేను అన్నాను, "వయస్సు వచ్చిన అమ్మాయి, అందుకని కట్టుబాట్లో ఉంచాలనుకున్నారేమో!" అని. అడుగడుగునా కామి లేని వెలితి కనబడుతూంది. అయినా ఏం చేస్తాం? ఎవరికెవరు అన్న సత్యాన్ని అర్థం చేసుకుని ఇలా కాలం గడుపుతున్నాం.

ఇదీ కామికీ మాకూ గల సంబంధం. ఇహ పోతే, కామి చెప్పిందాని సారాంశం.

కామి సిగ్గుపడ్డది ఈ మాట చెప్పేముందు. అయినా చెప్పింది. తాను ప్రేమించిందట పొరుగూరి రాజాని. రాజావాళ్ల చేను, కామివాళ్ల చేను ఒక్కదగ్గిరే. అవే కలిపాయి వాళ్ల మనసుల్ని. రాజా అందగాడు, గుణవంతుడు, తనకు తగ్గవాడు. వాళ్ల అయ్యా అమ్మలకి ఒక్కడే. వాళ్ల అయ్యా అమ్మా కూడా కామి తమ కోడలయితే తమ ఇల్లు కలకలలాడుతుం దనుకున్నారు. అందుకని కామి వాళ్ల అన్నతో ఈ విషయం కదిపారు కూడా. కాని వాడు ఒప్పుకోలేదు. అంతేగాకుండా మా ఇంట్లో పని కూడా మానేయమన్నాట్ట.

కామి కింకేం చేయాలో తోచలేదు. దీర్ఘంగా ఆలో చించింది. చివరికి ఓనాడు మా ఆవిడకి అన్ని సంగ తులూ చెప్పి సలహా అడిగిందిట. ఆవిడ చెప్పిన సలహా మీదే నిన్న గప్‌చిప్‌గా రాజాతో సహా యాదగిరి వెళ్లిం దిట! ఆ స్వామి శ్రీ లక్ష్మీనృసింహస్వామి ముందు పెళ్లి చేసుకున్నారట.

ఇదంతా విన్న నేను "బలేదానివే, కామాక్షీ! స్వయం వరం చేసుకున్నావన్నమాట!" అన్నాను. కామి తల వంచుకుని "క్షమించన్నయ్యా, నీకు ముందే చెప్పలేక పోయాను" అంటూ, "ఎలాగూ తోబుట్టిన అన్నా వదినలు దీవించరు! భగవంతుడిచ్చిన అన్నా వదినలైన మీరైనా దీవించండి!" అంటూ మా ఇద్దరి కాళ్లకూ నమస్కరించింది. కామికి మాయందు గల అభిమా నానికి నా మనస్సెంతో ఉప్పొంగింది. కామిని ఎల్లకాలం పసుపుకుంకుమలతో వర్ధిల్లమని దీవించి ఓ యాభై రూపాయలు చేతిలో పెట్టాను. మా ఆవిడ నావేపు కించిత్తు గర్వంగాచూస్తూ లోపలికి వెళ్లి పసుపూ కుంకుమా, ఓ కొత్త చీరా, రెండు రవికెలు తెచ్చి ఇచ్చింది. కామాక్షి కళ్ళు కృతజ్ఞతతో మెరిశాయి. "కామీ, జరగవలసింది జరిగిందికాని రేపు రాజాని తీసుకుని ఇక్కడికి వచ్చెసేయ్. ఎవరేమన్నా అంటే నే నున్నానులే!" అంటూ ధైర్యం చెప్పాను.

"మీ రుండట మేమిటండీ? వాళ్ళు ఎప్పుడో మొగుడూపెళ్ళా, లయ్యారు! ఇక ఎవరుమాత్రం ఏం చేస్తారు? మహా అయితే ముక్కుమీద వేలు వేసు కుంటారు!" అంటూ మా ఆవిడ కామాక్షివేపు చూస్తూ చిరునవ్వు నవ్వింది. ఆ నవ్వుతో జోడు కల్పిన కామాక్షి కళ్ళు తళతళ మెరిశాయి. నేను తృప్తిగా గాలి పీల్చాను. ★

యస్. కృష్ణారెడ్డి



విభ్రాంతి ఫోటో—పి. రామారావు (రాజమండ్రి)